మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition



రిపోర్టర్స్ కలెక్టివ్ నివేదికలో...

బాబు ఓటు చోరీ మోసాలు బట్టబయలు

చంద్రబాబు కూటమికి ప్రజల మద్దతు లేకపోయినా.. ఓట్ల చోరీ, అక్రమాలు, మోసాలతో అధికారంలోకి వచ్చిందనడానికి 2024 ఎన్నికల్లో పోలైన ఓట్లలో భారీ తేడాలే ప్రబల నిదర్శనం. పలు సామాజిక సంస్థలు..రాజకీయ విశ్లేషకుల రిపోర్టులను బలపరిచే మరో నివేదిక తాజాగా బయటపడింది. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో 31,471 ఓట్లు రికార్డుల నుంచి మాయమైన విషయం బహిర్గతమైంది. ఈ భారీ రిగ్గింగ్ బాగోతాన్ని జాతీయ స్థాయి జర్నలిస్టులు సభ్యులుగా ఉన్న 'ది రిపోర్టర్స్ కలెక్టివ్' అనే సంస్థ సాక్ష్యాలతో సహా బహిర్గతం చేసింది. చంద్రబాబు కూటమి సిస్టమాటిక్ రిగ్గింగ్‌ను మరోసారి బయట పెట్టింది. కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు గెలుపు పైనా అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది.

చీకటి బాగోతాలు వెలుగులోకి తెచ్చిన రిపోర్టర్స్ కలెక్టివ్

చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం ఓటింగ్ సరళిపై రిపోర్టర్స్ కలెక్టివ్ సంస్థ చేసిన పరిశోధనలో 2024 ఎన్నికల్లో చంద్రబాబు కూటమి చీకటి బాగోతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వివరాలను ఆ సంస్థ 'ఎక్స్'లో వెల్లడించింది. స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాలు, పార్లమెంటు స్థానాన్ని తెలుగుదేశం పార్టీ గెలుచుకుందని, రిగ్గింగ్ జరిగిందన్న ఆరోపణలకు ఇది బలం చేకూరుస్తోందని ఆ సంస్థ వ్యాఖ్యానించింది. ఈ నివేదిక జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. అనేక రాజకీయ పార్టీలతో పాటు మేధావులు, రాజకీయ విశ్లేషకులు ఈ మోసపూరిత ఎన్నికలను గట్టిగా నిలదీస్తున్నారు.

31,471 మంది ఓటర్ల లెక్క మాయం

ఏ ఎన్నికలైనా పోలింగ్ సమయంలో క్యూలో నిల్చున్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ సమయం ముగిసినా కూడా అప్పటి వరకు క్యూలో ఉన్న వారికి స్లిప్పులు ఇచ్చి, పోలింగ్ కొనసాగిస్తారు. ఇలా పోలింగ్ సమయం తర్వాత ఓటు వేసిన వారి వివరాలతో అధికారులు ప్రత్యేక రికార్డులు నిర్వహించాలి. పోలింగ్ జరిగిన 2024 మే 13వ తేదీ సాయంత్రం 6 గంటల తర్వాత చిత్తూరు లోక్‌సభ నియోజకవర్గంలో క్యూలలో 56,067 మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం (ఈసీ) అంతర్గత రికార్డులు చెబుతున్నాయి. ఈవీఎంలలో లోపాలు, హింస కారణంగా పోలింగ్ రాత్రి 2 గంటలకు జరిగిందని ఈసీ అనాడు పేర్కొంది. ఇదే పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కుప్పం, నగరి, చంద్రగిరి, జీడీ నెల్లూరు, చిత్తూరు, పలమనేరు, పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఏపీలో లోక్‌సభకు, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరిగినందున ప్రతి ఓటరు లోక్‌సభ స్థానానికి, అసెంబ్లీ స్థానానికి ఓట్లు వేయాలి. అంటే పార్లమెంటు స్థానానికి ఎన్ని ఓట్లు పోలయ్యాయో, అసెంబ్లీ స్థానానికి కూడా అన్నే పోలవ్వాలి. కానీ, ఇక్కడ విచిత్రం ఏంటంటే.. ఏడు అసెంబ్లీ నియోజవర్గాల్లో సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత 24,596 మంది ఓట్లు వేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. అంటే మిగిలిన 31,471 మంది ఓటర్ల లెక్క ఏమైపోయిందన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకం. వీటిని రికార్డుల నుంచి తొలగించారన్న అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ ఎన్నికలు ఎంత మోసపూరితంగా జరిగాయో తేటతెల్లం చేస్తోంది.

బాబు సహా వారంతా ఎలా గెల్చినట్లు?

రిపోర్టర్స్ కలెక్టివ్ సంస్థ చేసిన పరిశోధన ఏకంగా సీఎం చంద్రబాబు నాయుడుతో సహా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడుగురు టీడీపీ ఎమ్మెల్యేల గెలుపునే ప్రశ్నిస్తోంది. 2024 జూన్ 4వ తేదీన ఓట్లు లెక్కించారు. కుప్పంలో జరిగిన లెక్కింపు చంద్రబాబుకు ముచ్చెమటలు పట్టించింది. తొలి నాలుగు రౌండ్లలో వైఎస్సార్‌సీపీ కుప్పం అసెంబ్లీ అభ్యర్థి భరత్, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పకు .. టీడీపీ అభ్యర్థులకు వంద ఓట్ల తేడానే ఉంది. అధికం ఇలాగే ఉంటే చంద్రబాబుకు ఓటమి తప్పదని అందరూ భావించారు. కానీ ఆ తరువాత రౌండ్లలో టీడీపీకి అనూహ్యంగా ఓట్లు పెరిగిపోయాయి. దీంతో చంద్రబాబు విజయం సాధించారు. ఇలా ఓట్లు అనూహ్యరీతిలో పెరగడం పలు అనుమానాలకు తావిచ్చింది. మిగతా నియోజకవర్గాల్లోనూ ఓట్ల సరళి ఇలానే ఉంది. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గంలో వీరంతా విజయం సాధించడానికి లెక్కల్లోంచి మాయమైన ఓట్లే కారణమన్న వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో వినిపిస్తున్నాయి.